క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

ఖానాపురం : రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 65శాతం సబ్సిడీపై మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌లతో విస్తరణాధికారుల వద్దకు వెళ్లి అనుమతులు పొంది విత్తనాలు తీసుకోవాలన్నారు. ఈనెల 30లోపు తీసుకోవాలని తెలిపారు.

అందుబాటులో ఎరువులు

వానాకాలం సాగుకు ఎరువులను రైతులకు అందుబాటులో ఉన్నట్లు ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి అన్నారు. ఈ మేరకు సొసైటీ పరిధిలోని నాలుగు సెంటర్లలో మంగళవారం ఎరువుల బస్తాలను దిగుమతి చేయించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవినేని వేణుకృష్ణ, సీఈఓ ఎల్లబోయిన ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ మేరుగు రాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



చెన్నారావుపేట : మండలంలోని పుల్లయ్య బోడు గ్రామపంచాయతీ శివారులోని ఎర్రగడ్డ తండా నుంచి మదనాపురం మీదుగా లింగాతండా వరకు రోడ్డు పనులను సర్పంచ్ బోడ సమ్మునాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారంగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గిరిజన అభివృద్ధి శాఖ నుంచి రూ. కోటి 36లక్షలు మంజూరు చేయించారని అన్నారు. కార్యక్రమంలో వారు సభ్యులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మతండా నుంచి ముత్తోజిపేట నేషనల్ హైవే వరకు రూ. 64లక్షలతో బీటీ రోడ్డు మంజూరైంది. కాగా ముత్యాలమ్మతండా సర్పంచ్ భూక్య సైదా మంగళవారం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు బానోత్ ఈర్య, గుగులోత్ ఈర్య, లకావత్ పూల్‌సింగ్, యూత్ సభ్యులు భూక్యా సుధీర్, జీవన్, గణేష్, వంశీ, సురేష్, లాలూ, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ల బహూకరణ



నర్సంపేట : నర్సంపేటకు చెందిన డాక్టర్ జాన్సన్ జన్మదినం సందర్భంగా మంగళవారం నర్సంపేట ఆర్టీసీ డిపోకు నాలుగు ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం విజయ మాట్లాడుతూ ఆర్టీసీ డిపో అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

నర్సంపేట : పేదలకు ఇంటి స్థలాలు, అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని తెలంగాణ ప్రజా సంఘాలు పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈనెల 18నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర వ్యాప్త బస్సుయాత్రను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌నాయక్ కోరారు. ఈ మేరకు జిల్లా కమిటీ సమావేశం పట్టణంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ భూముల్లో పక్కా ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంటి పట్టాతోపాటు ఇంటి నంబరు, విద్యుత్ మీటరు ఇవ్వాలని కోరారు. సమావేశంలో చింతమల్ల రంగయ్య, భూక్య సమ్మయ్య, కొరబోయిన కుమారస్వామి, సాయిలు, ఆనందం, విజయ, స్వామి, వెంకన్న, సాంబయ్య, యాకుబ్, సంజీవ, బాలకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

వర్ధన్నపేట: కాయంపేటకు చెందిన సత్తెమ్మ అనే వృద్ధురాలు మంగళవారం ఉప్పరపల్లి గ్రామానికి బస్సులో బయలుదేరింది. ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో వరంగల్ వైపునకు బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడి ఆమెను ఢీ కొట్టడంతో వృద్ధురాలికి గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పోక్సో కేసు నమోదు

సంగెం : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. భరత్ తెలిపారు. సంగెం మండలంలోని ఓ గ్రామపంచాయతీ పరిధిలోగల తండాకు చెందిన బాలిక(15)పై అదే తండాకు చెందిన యువకుడు(20) పెళ్లిపేరుతో మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడిపై లైంగిక దాడి, పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. సదరు బాలికను భరోసా కేంద్రానికి పంపించామన్నారు. ఈ కేసును పర్వతగిరి సీఐ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలతో తస్మాత్ జాగ్రత్త

వర్ధన్నపేట : రైతులకు నకిలీ విత్తనాలు అంటగడితే పీడీ చట్టం ప్రయోగిస్తామని ఓ వైపు ప్రభుత్వం హెచ్చరిస్తున్నా.. వానాకాలం సీజన్ ప్రారంభంలోనే జిల్లాల్లో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడడం అక్రమార్కుల చర్యలకు నిదర్శనంగా మారుతోంది. గతంలోనూ పత్తి, మిరప విత్తనాలు, సేంద్రియ ఎరువులు, నిషేధిత గడ్డి మందు గ్లైఫోసేట్ పట్టుబడిన ఘటనలున్నాయి.. గుళికలు, బయోలు, సేంద్రియ ఎరువులు, పోషకాల మిశ్రమమంటూ పలు రకాలుగా గ్రామాల్లో అడ్వాన్స్ బుకింగ్‌లు ప్రారంభం కాగా ఇలాంటి మోసపూరిత ఉత్పత్తులతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

హైబ్రిడ్ రకాలకే అధికం..

వరితో పాటు ఇతర పంట విత్తనాలకు ధర పెద్దగా తేడా ఉండదు. కాబట్టి వీటిని విక్రయించేందుకు మోసగాళ్లు అంతగా ఇష్టపడరు. పత్తి, మిరప, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటల్లో గ్రాముల బరువు విత్తనాలకే వేలల్లో ధర ఉండడంతో అక్రమార్కులు వీటిని యథేచ్ఛగా విక్రయించి లక్షల్లో సంపాదిస్తుంటారు. జిన్నింగ్ మిల్లుల నుంచి తెచ్చిన పత్తి గింజలు, మార్కెట్లో కొన్న మక్కలను పొడి పరిశ్రమ నుంచి తెచ్చిన మిరప గింజలు, ఇతరత్రా సాధారణ పద్ధతుల్లో సేకరించిన కూరగాయల గింజలకు విత్తనశుద్ధి మందును పట్టించి అందమైన కవర్లు అంటించిన డబ్బాల్లో నింపి పేరున్న కంపెనీల పేరిట లేదా నూతన విత్తనమంటూ ప్రతి పంటకు రైతులకు అంటగడతారు. మధ్యవర్తులు, కొందరు దుకాణదారులు, అధికారులు వీరికి సహకరిస్తుండడంతో నకిలీ విత్తనాలు రైతులకు చేరి దిగుబడి రాక నష్టపోతున్నారు.



హైబ్రిడ్ విత్తనాలు

రైతులు గమనించాల్సినవి...

పరిశోధన స్థానాలు, ప్రభుత్వ అనుమతి గల దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులను తీసుకోవాలి. గ్రామాల్లో జీరో కింద ఎలాంటివి కొనవద్దు. విత్తనాల సంచిపైన తయారీ స్థలం, కంపెనీ, ఫోన్‌నంబర్, లాట్, బ్యాచ్ నంబరు, గడువు, జన్యు స్వచ్ఛత, మొలకశాతం, ధర తదితర పూర్తి వివరాలను పరిశీలించాలి. సంచిపైగల క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వివరాలు సెల్‌ఫోన్‌లో వివరాలు వెల్లడి కావాలి. విత్తనాలను బస్తా, ప్యాకెట్లపై గాని విత్తన వివరాలు లేబుల్ రూపంలో లేకపోతే నకిలీవని గుర్తించాలి. నకిలీ విత్తనాలని అనుమానం వస్తే వ్యవసాయాధికాధికారులకు ఫిర్యాదు చేయాలి.

విత్తన చట్టం

విత్తన నియంత్రణ చట్టం 1983 సీడ్ యాక్ట్ 1966 ప్రకారం డీలర్లు ప్రభుత్వం జారీ చేసిన లైసెన్సులు కలిగి ఉండాలి. ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన విత్తన కంపెనీల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తన వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. దుకాణాల్లో ధరల పట్టిక రైతులకు కనిపించే విధంగా ఉండాలి. నాణ్యమైన విత్తనాలనే సరఫరా చేయాలి. బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి.

రశీదు తీసుకోవాలి



రైతులు విత్తనాల కొనుగోళ్ల సమయంలో తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలి. పంట పూర్తయ్యేంత వరకు వాటిని భద్రపరుచుకోవాలి. రశీదు ఉంటేనే పంట దిగుబడి రానపుడు పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుంది.

- రాంనర్సయ్య, మండల వ్యవసాయాధికారి

కబ్జాకు గురైన భూమిని కాపాడాలి

మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని 204సర్వే నంబర్‌లో కబ్జాకు గురైన 20గుంటల భూమిని కాపాడాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కబ్జాకు గురైన భూమిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, ఏసీపీ, తహసీలార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన పేదలు గుడిసెలు వేసుకొని ఉండడం జరుగుతుందన్నారు. రాత్రికి రాత్రే గుడిసెలను తొలగించి కొంత మంది అధికార పార్టీ నాయకులు భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వెంటనే ఆక్రమదారులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్డేపల్లి నర్సింహరాములు, బాల్నె జగన్, కొంపెల్లి రాజేందర్, కల్వచర్ల రామాంజనేయులు, చిలువేరు రజనిభారతి, రేసు శ్రీనివాస్, పంజాల రాము, గుంటి వీరప్రకాశ్, సత్యనారాయణ, పృథ్వీరాజ్, మల్లయ్య, సమ్మయ్య, పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న ఎస్సై సురేష్ నాయక్

నర్సంపేట రూరల్ : యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని నర్సంపేట రూరల్ ఎస్సై భూక్యా సురేష్ నాయక్ అన్నారు. నర్సంపేట మండలంలోని భాంజీపేట గ్రామంలో సోమవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబా, పటిక, బెల్లం రవాణా చేసిన, నిల్వ చేసిన, అమ్మకాలు, కొనుగోలు చేసిన సమాచారం అందించాలన్నారు. ఇటీవల ఎక్కువశాతం యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, వారికి బంగారు భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సర్పంచ్ పార్వతమ్మ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖానాపురం : మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన తాళ్ల సాంబయ్య-అనితలది నిరుపేద కుటుంబం. కాగా వారి కుమార్తె వివాహం నిశ్చయించడంతో ఆర్థిక స్తోమత లేక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి బీఆర్ఎస్ నాయకులు తీసుకెళ్లారు. దీంతో రూ.10వేలు పంపడంతో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు బందారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారికి అందజేశారు. సర్పంచ్ నరేష్, శ్రీనివాస్, సారంగం, పాపారావు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన పర్కాల రాజు ఇటీవల వడదెబ్బతో మృతి చెందాడు. కాగా రాజుతో పాటు పదోతరగతి చదివిన స్నేహితులు మంగళవారం రూ.8,000లు అందించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో విజేందర్, అనిల్‌కుమార్, శ్యాం, రాజు, కోటి, మహేందర్, భిక్షపతి, అన్వర్, అంకుస్, రజాక్, మల్లయ్య, లింగస్వామి, రవి, ప్రసాద్, విష్ణుగౌడ్, ఎల్లగౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఆర్టీసీ ఉద్యోగులకు జీతాలు పెంచాలి

నర్సంపేట : ఆర్టీసీ ఉద్యోగులకు పదేళ్లుగా జీతాలు పెంచక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, 2017నుంచి 2021కి సంబంధించిన రెండు పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని నర్సంపేట డిపో ఉద్యోగులు కోరారు. ఈ మేరకు డిపో ఎదుట నేడు హైదరాబాద్‌లో టీజేఎంయూ ఆధ్వర్యంలో నిర్వహించబోయే చలో బస్ భవన్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేతన సవరణ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆర్టీసీలో వెంటనే యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గొలనకొండ వేణు, సోమ మాధవ్, ఓరుగంటి కొమ్మాలు, కొలిశెట్టి రంగయ్య, రాధిక, బూర ప్రవీణ్‌కుమార్, మంద రాజు, గొడిశాల వెంకటేశ్వర్లు, నాగిశెట్టి అశోక్‌కుమార్, బొల్లపెల్లి రాజు, గుగులోత్ బాలాజీ, నానబోయిన పెద్ద రాజయ్య, వరికెల మురళి, శివ, క్రాంతికుమార్, బాబు, సాంబయ్య, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిపో ఉద్యోగులు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

పరకాల : మానసిక ఒత్తిడి దూరం అయ్యేందుకు యోగా శిక్షణ తరగుతులు ఎంతగానో దోహదపడుతాయని యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్‌రావు అన్నారు. ఈ నెల 21 యోగా డే సందర్భంగా పరకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10రోజుల పాటు శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. యోగా శిక్షణలో స్థానికులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శిక్షణ సందర్భంగా యోగా గురువు రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుత జీవనశైలి మారడంతో పాటు ఆర్థికపరంగా, కుటుంబ సమస్యలతో అనేక మంది మానసిక ఒత్తిడికి గురై గుండెపోటు బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శరీరానికి కావాల్సిన వ్యాయామం లేకపోవడం ప్రమాదకరంగా మారిందన్నారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ యోగాశిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగలవారు 99082 24512 ఫోన్ ద్వారా సంప్రదించడం లేదా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు నిర్వహించే యోగా శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.



యోగ శిక్షణలో పాల్గొన్న స్థానికులు

బాధిత కుటుంబానికి పరామర్శ



వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణానికి చెందిన రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు కోమాండ్ల బాబురెడ్డి(68) అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య సోమవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి బాబురెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాజయ్య వెంట కౌన్సిలర్ సమ్మెట సుధీర్, కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి ఉన్నారు.

చర్య తీసుకోవాలి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో ముస్లింల కోసం షాదీఖానా(పెళ్లి మండపం) నిర్మించారు. కాగా షాదీఖానాను ప్రైవేటు వ్యక్తి ఆక్రమించాడని వెంటనే అతడిపై చర్య తీసుకుని షాదీఖానాను ఖాళీ చేయించి పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన ఎస్‌కె.మహబూబ్‌అలీ అడిషనల్ కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు.

చెట్లు నరికిన వారిపై..

తాటి, ఈత చెట్లు నరికిన వారిపై చర్య తీసుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని బూర్గుమళ్లలో నరికిన తాటిచెట్లను మంగళవారం పరిశీలించారు.

ఆర్థిక అక్షరాస్యత సదస్సు

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలో ఏపీజీవీబీ మందపల్లి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ వేణుధనుంజయ మాట్లాడారు. గ్రామంలోని ప్రతి వ్యక్తి బ్యాంక్‌లో ఖాతా కలిగి ఉండాలన్నారు. ఖాతాతో పాటు కేంద్రం అమలు చేస్తున్న బీమా పథకాలలో చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ ప్రతినిధులు భాస్కర్, మౌనిక, శ్రీకాంత్, విజేందర్, బ్యాంక్ మిత్ర బండి శ్రావణితో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

చెన్నారావుపేట : ఈ నెల 20న నిర్వహించే విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ రత్నమాల తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో మంగళవారం ఉపాధ్యాయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యా సంసవత్సరం పాఠశాలలో ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్టెంట్‌మెంట్‌పై చర్చించామన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, అభివృద్ధికి ఉపాధ్యాయుల సంఘాల నాయకులు సహకరించాలన్నారు. దశాబ్ది ఉత్సవాలను ప్రతి పాఠశాలలో ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. మండల నోడల్ ఆఫీసర్‌గా నియమించిన శ్రీరామోజు మోహన్‌రావును, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు సన్మానించారు. ఈ సమావేశంలో సంఘాల నాయకులు ఆంగోత్ భద్రయ్య, పూజరి సురేందర్‌గౌడ్, గుండేటి మహేందర్, నరహరి ఇంద్రయ్య, యాకయ్య, సిబ్బంది అశోక్, స్వప్న, సీఆర్‌పీలు సంపత్, బాబు, స్వామి, శిల్ప,హేమలత, యాదగిరి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ రత్నమాల

ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌తో బోధన సులభతరం

పర్వతగిరి : పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా విద్యాబోధన సులభతరం అవుతుందని మండల నోడల్ ఆఫీసర్ గయపు లింగారెడ్డి అన్నారు. అలాగే ఈ మేరకు మండలంలోని గోపనపల్లి ఉన్నత పాఠశాల, కొంకపాక ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు-మనబడి పనులను మంగళవారం పరిశీలించారు.

బోనం ఎత్తిన ఎర్రబెల్లి స్వర్ణ

వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గౌడ కులస్తులు తమ ఆరాధ్య దైవమైన శ్రీకంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కాగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు దంపతులు హాజరై మంగళవారం బోనమెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరామని తెలిపారు. వీరి వెంట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, వడ్లకొండ ఎల్లగౌడ్, ఆరెల్లి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి బోనం సమర్పిస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ

‘ప్రజల సొమ్ముతో ప్రచారం’

నర్సంపేట : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజా సొమ్మును వృథా చేస్తూ పార్టీ ప్రచారం చేసుకుంటున్నారని ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ముఖ్య నాయకుల సమావేశం రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎత్తుగడలను ప్రజాస్వామిక వాదులు గమనించాల్సిన అవసరం ఉందన్నారు. తొమ్మిదేళ్ల అభివృద్ధి అంటే కాళేశ్వరం, సచివాలయ నిర్మాణాలు, విదేశాలు పర్యటించడం అవుతుందా అని ప్రశ్నించారు. బహుజన రాజ్యాన్ని స్థాపించడమే లక్ష్యంగా పని చేయాలనే ఉద్దేశంతోనే ఆర్‌పీఐని బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సరిగొప్పుల స్నేహలత, లక్ష్మి, పుష్ప, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా..

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి : రాబోయే ఎన్నికల్లో నర్సంపేటలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని మందపల్లి, పీజీతండా గ్రామాలలో సోమవారం రాత్రి హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో నిర్వహించిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయంలోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. నాయకులు తోకల శ్రీనివాసరెడ్డి, ఎర్రల్ల బాబు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, పెండ్యాల రాజు, ఇంద్రదేవ్, సాంబయ్య, దంజ్యా నాయక్, రామారావు, నరిగె ప్రవీణ్, వెంకటరెడ్డి, రాజేశ్వరాచారి, జయరాం నాయక్, సమ్మయ్య పాల్గొన్నారు.



జోడోయాత్ర నిర్వహిస్తున్న దొంతి మాధవరెడ్డి

కనులపండువగా ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

శాయంపేట : మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో శ్రీగణేష, శివపంచాయతన, శ్రీ అభయాంజనేయ, వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య, నవగ్రహ, నాగేంద్రస్వామి, గ్రామదేవత ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం రెండో రోజు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ ఉత్సవాలను ఉదయమర్రి కృష్ణమూర్తి శర్మ, గ్రామ పురోహితులు వాసుదేవ మూర్తి శర్మల ఆధ్వర్యంలో ఆయన శిష్య బృందం వేదమంత్రోచ్ఛరణల మధ్య సామూహిక హోమాలు, ఫల పుష్పాదివాసములు, ధాన్యాదివాసం, కుంకుమ పూజ, కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 7.20గంటలకు దేవత మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త చకిలం విజయలక్ష్మి, రవీందర్, సర్పంచ్ త్రిపురాల లక్ష్మి, ఉపసర్పంచ్ గోనె నాగరాజు, ఆలయ కమిటీ చైర్మన్ చేల్ల లక్ష్మణరావు, వైస్ చైర్మన్ పెంతల నరేందర్, కమిటీ సభ్యులు మల్లయ్య, రాజు, నాగరాజు, కృష్ణ, శ్రీను, రవి, రాజేందర్, పాల్గొన్నారు. ఉత్సవాలలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ చందుపట్ల కీర్తిరెడ్డి పాల్గొనగా పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిళి, మండల అధ్యక్షుడు గడ్డం రమేష్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

నల్లబెల్లి : మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఆకలి కేకల ఫోరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బొట్ల పవన్, కో కన్వీనర్లుగా మాలోత్ సమ్ము నాయక్, పరికి కొర్నేల్, బత్తిని మల్లయ్య, వేముల రాజు, మామిండ్ల పెద్ద ఐలయ్య, చిన్న ఐలయ్య, ఎన్నమల నర్సయ్య, కొయ్యడ కుమారస్వామి, పల్లికొండ రవిలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్‌గా..

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్‌గా మేరుగు శివకోటియాదవ్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఏపీలోని మంగళగిరిలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ ముఖ్య నేతలతో పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.

నియామకం



చీటూరి అశోక్

వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన చీటూరి అశోక్‌ను బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అశోక్ మాట్లాడుతూ తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ పదవి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషిచేస్తానని అన్నారు.

బాధ్యతల స్వీకరణ

పర్వతగిరి : మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్‌గా నాజియాసల్మా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్‌తో పాటు, తెలుగు, బయోసైన్స్, హిందీ, మ్యాథ్స్, సీఆర్‌టీలు కొత్తగా జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి వరంగల్ జిల్లాలోనే పర్వతగిరి కేజీబీవీకి మంచి పేరు తీసుకురావడానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

గీతవృత్తిని చేర్చాలి

ఖానాపురం : తెలంగాణ ప్రభుత్వం కులవృత్తిదారులకు అందజేస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం జాబితాలో గీత వృత్తిదారులను చేర్చాలని మోకుదెబ్బ మండల అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గీత వృత్తిదారులపై తెలంగాణ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారిని పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే జాబితాలో గౌడ కులస్తులను చేర్చి ఆదుకోవాలని అన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి



కుమారస్వామి (ఫైల్)

సంగెం : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. సంగెం మండలం షాపూర్ గ్రామానికి చెందిన దొనికెన కుమారస్వామి(60)కి మూడేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. దీంతో ఏపని చేయలేకపోతున్నానని మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుమారస్వామి నోటి నుంచి నురగ వస్తుండగా చూసిన భార్య సుజాత గవిచర్లలోని కూతురుకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చింది. వారు వచ్చి 108వాహనంలో ఎంజీఎంకు తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం రాత్రి మృతి చెందాడు. కుమారస్వామి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సీతారాములు తెలిపారు.